ఖాళీ స్థలాలన్నీ
కంపుకంపు..!

అసలే నగరంలో పారిశుధ్యం పడకేసింది. ప్రభుత్వం మారిన తర్వాత పర్యవేక్షణ కొరవడి ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగు కనిపిస్తోంది. దీనిపై ఈ నెల 3వ తేదీ సాక్షి దినపత్రిక ఒంగోలు క్లస్టర్ పేజీలో 'నగరం.. దుర్భరం' శీర్షికతో ఫొటోలతో కథనం కూడా ప్రచురితమైంది. అయినప్పటికీ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారుల్లో చలనం లేకుండా పోయింది. దీనికితోడు నగరంలోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలన్నీ ముళ్లచెట్లు, మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల వ్యాప్తి కేంద్రాలుగా మారి చుట్టుపక్కల నివాసాల ప్రజలను వ్యాధులబారిన పడేస్తున్నాయి. దీనిపై అనేకమంది ఫిర్యాదులు చేస్తున్నా..పట్టించుకునే వారు కరువయ్యారు. అసలే వర్షాకాలం కావడంతో వర్షం నీరు నిలిచి పలు ఖాళీ స్థలాలు చిన్నపాటి కుంటలు, చెరువులను తలపిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంపై కూడా దృష్టి సారించకుంటే ఒంగోలు ప్రజల ఆరోగ్యం అటకెక్కడం ఖాయమని తెలుస్తోంది.

- సాక్షి, ఒంగోలు



రాజీవ్‌నగర్‌లో నివాసాల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన చిల్లచెట్లు, మురుగు నిల్వలు



రాంనగర్ 10వ లైన్‌లో...



హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఖాళీ స్థలంలో నిలిచిన వర్షం నీరు



భాగ్యనగర్ 4వ లైన్‌లో...



మంగమూరు రోడ్డులో...



సుజాతనగర్‌లో నివాసాల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు



వడ్డికాలనీలో పెరిగిన చెట్లు, నిల్వ ఉన్న మురుగునీరు





ఇస్లాంపేట డ్రైనేజీలో చెత్త అడ్డుపడి నిలిచిన మురుగునీరు



గాంధీనగర్‌లో డ్రైనేజీ దుస్థితి..



భాగ్యనగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు



రాంనగర్ 7వ లైన్‌లో...

చప్పిడి వెంగళరావుకు అభినందనల వెల్లువ



వెంగళరావును సత్కరిస్తున్న మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు వెంకట్రావు, తదితరులు

ఒంగోలు: హైదరాబాద్‌లోని హెచ్‌ఎస్‌సీ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావును శనివారం మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దళిత ఉద్యమ నేతలు దండేల కృష్ణ, గిరిజన బహుజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, మాల మేధావులు కొండమూరి ప్రకాష్, కురుగుంట్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఐనంపూడి నరసింహం, దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు చవల పీటర్‌పాల్, దళిత సంఘాల నాయకులు కంకణాల ఏసు, బీఎస్ఎన్ఎల్ నాయకులు యెరిచర్ల సుబ్రహ్మణ్యం, పైనం ఆరోగ్యం, బత్తుల రమణయ్య, తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఆవుల రమణారెడ్డి

ఒంగోలు: ప్రతి విద్యార్థి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఆవుల రమణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక చెరువుకొమ్ముపాలెంలోని శ్రీ సరస్వతి జూనియర్ కాలేజీలో స్పోర్ట్స్ వీక్‌ను క్రీడా జ్యోతి వెలిగించి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు మాత్రమే కాకుండా క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థుల శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి, మానసిక ఉత్తేజానికి స్పోర్ట్స్ వీక్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ వారం రోజులపాటు క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యాసంస్థల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి శిద్దా జన్మదినం



ఒంగోలులో కేక్ కట్ చేసి కుమారుడు సుధీర్‌కు తినిపిస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు/చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలను శనివారం రాత్రి స్థానిక ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. బల్లికురవ లక్ష్మీగ్రానైట్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణారావు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా రాఘవరావు దంపతులు, వారి కుమారుడు శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు కట్ చేశారు. ఒంగోలుకు చెందిన ప్రముఖులు శిద్దా పాండురంగారావు, శిద్దా బాలాజీ, శిద్దా సురేష్, శిద్దా భరత్, జ్యోతి గ్రానైట్ సీఓఓఎం శివరామ్, గుప్తాస్ వీరబాబు, తదితరులు పాల్గొని శిద్దాకు శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తి హరిహరక్షేత్రంలోనూ శిద్దా రాఘవరావు తన కుటుంబ సభ్యులతో కలిసి సేవా కార్యక్రమాలతో మనుమడు విహాన్ పుట్టినరోజుతో పాటు తన పుట్టినరోజు వేడుకలనూ జరుపుకున్నారు. బధిరుల పాఠశాల విద్యార్థులకు, పేపర్ డెలివరీ బాయ్స్‌కు నూతన వస్త్రాలు అందించారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో శనివారం పొగాకు గరిష్టంగా కేజీ రూ.358 ధర పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 11,151 పొగాకు బేళ్లు రాగా, 9,595 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,556 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 128వ రోజు వేలం పాటలో 5,412 బేళ్లు రాగా 4,690 వ్యాపారులు కొనుగోలు చేశారు. 722 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.310.15 వచ్చింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 122వ రోజు వేలం పాటలో 5,739 బేళ్లు రాగా, 4,905 బేళ్లు కొనుగోలయ్యాయి. 834 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.203, సరాసరి రూ.307 పలికింది.

ఎంపీడీఓకు ఘనంగా వీడ్కోలు



ఎంపీడీఓ శ్రీహరిని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు

మద్దిపాడు: మండలంలో ఎన్నికల నిమిత్తం బదిలీపై వచ్చి తిరిగి బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ శ్రీహరికి కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీఓగా ఇక్కడ విధుల్లో చేరిన దగ్గర నుంచి పనులు సజావుగా నడిపిస్తూ ఎన్నికల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారని శ్రీహరిని అభినందించారు. పలువురు గ్రామ కార్యదర్శులు మాట్లాడుతూ తమతో చక్కగా పనిచేయించుకుని ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఎంపీడీఓ చూసుకున్నారన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా సిబ్బంది సమస్యలను పూర్తిగా పరిష్కరించారని, ఆయన బదిలీ అయి వెళ్లిపోవడం నిజంగా బాధాకరమని అన్నారు. కార్యాలయ ఏఓ సుబ్బారావు మాట్లాడుతూ వృత్తి పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి ఎంపీడీఓ శ్రీహరి అని కొనియాడారు. చివరిగా ఎంపీడీఓ శ్రీహరి మాట్లాడుతూ తనకు అందరూ సహకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రికి నివాళులు

ఒంగోలు టౌన్: 11 ఏళ్ల పాటు సుదీర్ఘంగా బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బుద్ధదేవ్ భట్టాచార్య.. తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన నిజమైన ప్రజా నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.సిద్దయ్య కొనియాడారు. గత గురువారం మరణించిన బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభను శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత భట్టాచార్య చిత్రపటానికి పూలు చల్లి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిద్దయ్య ప్రసంగిస్తూ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా అనేక పదవుల్లో పనిచేసిన భట్టాచార్య నిరాడంబరంగా జీవించారని తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇస్తానన్న ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పదవిని తిరస్కరించి ప్రజల పక్షం నిలిచి నిబద్ధత చాటుకున్న ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, కె.రమాదేవి, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, బాల కోటయ్య, జి.రమేష్, తిరుపతయ్య, రఘురాం తదితరులు పాల్గొన్నారు.



భట్టాచార్య మృతికి సంతాపం తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

ఒంగోలు: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు నిండిన సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండాను సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు ఆవిష్కరించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణోత్సవ సంబరాలు జరుగుతున్నాయన్నారు. 1974 ఆగస్టు 8న ఆవిర్భవించిన యూటీఎఫ్ ఈ ఏడాది డిసెంబర్‌లో 25 వేల మందితో కాకినాడలో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించనుందన్నారు. ప్రతి మండలంలో స్వర్ణోత్సవాలు నిర్వహించాలని, ఉద్యమం ఆవశ్యకతను ఉపాధ్యాయులకు, ప్రజానీకానికి తెలియజేయాలన్నారు. సీనియర్ నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ ఈ 50 సంవత్సరాల్లో ఉద్యమం కోసం పనిచేసిన ప్రతి యూటీఎఫ్ నాయకుడ్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యమంలో 3వ తరం పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణ, శేషయ్య , షంషుద్దీన్, జిల్లా అధ్యక్షులు రవి, సహ అధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్.చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో సత్తాచాటిన పీడీకి అభినందనలు

ఒంగోలు: పాన్ అమెరికన్ ఇంటర్నేషనల్ మాస్టర్ గేమ్స్‌లో స్విమ్మింగ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్న ఒంగోలు పీవీఆర్ బాలికోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు డి.జ్యోత్స్నాదేవిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అభినందించారు. జ్యోత్స్నాదేవితో పాటు పలువురు శనివారం ఒంగోలు ఎంపీ కార్యాలయానికి చేరుకుని ఎంపీని కలిసి పతకం సాధించిన విషయాన్ని వివరించారు. ఈ పోటీలు క్వీల్‌ల్యాండ్స్‌లో జరిగాయని తెలిపారు. జ్యోత్స్నాదేవి వెంట రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ఒంగోలు టౌన్: స్థానిక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి డయల్ 100, 112, వీహెచ్ఎఫ్ సెట్ పనితీరు, పోలీసు వాట్సాప్, సీసీటీవీల పనితీరుపై ఆరా తీశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తమకు ఎదురైన ఇబ్బందుల నుంచి రక్షణ కోసం నిత్యం కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేస్తుంటారని, సత్వరమే స్పందించడం వలన ఎంతో మందికి న్యాయం జరుగుతుందని చెప్పారు. ఎస్పీ వెంట ఎస్బీ సీఐ రాఘవేంద్రరావు, ఎస్సైలు మీరాసాహెబ్, ప్రభాకరరెడ్డి ఉన్నారు.